క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం...

కూకట్‌పల్లి: కేర్ అండ్ క్యూర్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఫేజ్ 2 వారిచే చివరి బస్‌స్టాప్ వద్ద, వినాయక మండపంలో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు.ఈ శిబిరంలో స్త్రీలకు,గర్భిణీస్త్రీలకు వైద్య పరీక్షలు, బిపి, షుగర్‌కు అన్ని రకాల జనరల్ కేసులను,ఎముకలకు సంబంధించిన వ్యాధులను పరీక్షించనున్నారు. బీపీ షుగర్ పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయనున్నారు.

గమ్యం యాప్ డౌన్ లోడ్ చేసుకోండి



యాప్ గురించి ప్రయాణీకులకు వివరిస్తున్న డిపో మేనేజర్ మహ్మద్ ఇషాక్

మూసాపేట: మూసాపేటలోని ఆర్‌టీసీ బస్ షెల్టర్‌లో శనివారం డిపో మేనేజర్ మహ్మద్ ఇషాక్ టీఎస్ఆర్‌టీసీ గమ్యం యాప్ గురించి ప్రయాణీకులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాప్‌ను ప్రయాణీకులు డౌన్‌లోడ్ చేసుకుంటే నగరంలోని ఏ బస్‌షెల్టర్ వద్ద ఉన నా రూట్‌లో బస్ వచ్చే సమయం తెలుసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

షెల్టర్ కూల్చివేత

మూసాపేట: మూసాపేటలో నిర్మిస్తున్న షెల్టర్‌ను శనివారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. షెల్టర్ నిర్మాణం జరిగితే వాహనాలు రోడ్డుపైన పార్కింగ్ చేస్తారని, స్థానికులు రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో కూల్చివేశారు. మళ్లీ నిర్మాణం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రభుత్వ స్థలంలో విగ్రహాల తొలగింపు

ఓల్డ్ బోయిన్‌పల్లి: శనివారం తెల్లవారు జామున అంజయ్యనగర్‌లోని ప్రభుత్వ స్థలంలో స్థానిక కుర్మ సంఘం నాయకులు బీరప్ప విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు మొదలు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న కొంత మంది స్థానిక యువకులు పోలీసులకు, స్థానికంగా ఉన్న రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. రెవెన్యూ సిబ్బంది, పోలీసులు చేరుకుని విషయం తెలుసుకున్నారు. అధికారులు విగ్రహాలను తొలగించారు.

మార్గం అధ్వానం

● రాళ్లు రప్పలు తేలి ప్రమాదకరంగా మారిన అంతర్గత రహదారి





అధ్వానంగా మారిన ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని అంతర్గత రహదారులు

ఆల్విన్‌కాలనీ: అంతర్గత రహదారుల్లో రాళ్లు రప్పలు తేలి గుంతలమయంతో అధ్వానంగా మారి స్థానిక ప్రజలు గాయాల పాలవుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ ఫేజ్ టు లోని సి బ్లాక్ చివరి బస్‌స్టాప్ ఎదురు వీధుల్లో, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం చుట్టూ ఉన్న వీధులన్నీ రహదారుల్లో సీసీ రోడ్డు లేకపోవడంతో ప్రాణ సంకటంగా మారింది. గత రెండు సంవత్సరం క్రితం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం తవ్వి నిర్మాణ పనులు పూర్తి అయిన తరువాత రోడ్డు నిర్మాణ పనులు మరిచారు. కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ కంకర తేలి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు సర్కస్ ఫీట్లు వేస్తూ ప్రయాణించాల్సి వస్తోందని తెలుపుతున్నారు. రాత్రి వేళల్లో రహదారిపై నడవాలంటే భయభ్రాంతులకు గురవుతున్నామని పేర్కొంటున్నారు. చిన్నారులు వయో వృద్ధులు రహదారిపై ప్రయాణిస్తూ గాయాల పాలైన సంఘటనలు కేడా ఉన్నాయని తెలుపుతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు సమస్యలపై పర్యటించినప్పుడు త్వరలోనే అన్ని రహదారులకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి సమస్యలు లేని కాలనీగా తీర్చిదిద్దామని తెలిపి దాటవేశారనిఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకోలేని స్థానికులు మండిపడుతున్నారు. అనేక సార్లు స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దాఖలాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులకు పన్నుల వసూలు చేయడంలో ఉన్నంత శ్రద్ధ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించటంతో చిత్తశుద్ధి కనిపించటం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2లోని శివాలయం చుట్టు పక్కల ఉన్న వీధుల్లో పర్యటించి రహదారుల సమస్యలు పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీసీలందరికీ బీసీబంధు ఇవ్వాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ నాయకులు

మూసాపేట: బీసీ బందు పథకాన్ని కేవలం 14 కులాలకే కాదు బీసీ జాబితాలోని అన్ని కులాలకు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో కూకట్‌పల్లి వైజంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టాఆరు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా వాడుకునేందుకు ఎన్నికల ముందు పథకాలు ప్రవేశపెడుతున్నారని అన్నారు. అన్ని కులాలకు బీసీ బంధు అందించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర రాష్ట్రం అందేరి వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే అమిత్ సతం, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, ఓబీసీ మెర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టి గుర్తు తెలియని వ్యక్తులు

భాగ్యనగర్‌కాలనీ: గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టి పరారైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. శంషాబాద్‌కు చెందిన దామోదర్‌నాయుడుకు కూకట్‌పల్లి శేషాద్రినగర్‌లో నివాసం ఉంది. ఈ ఇంటిలో నాలుగు కుటుంబాలు అద్దెకు ఉంటున్నారు. శుక్రవారం అర్ధ రాత్రి పార్కు చేసిన మూడు ద్విచక్ర వాహనాలు, రెండు సైకిళ్లకు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు స్థానికులు గుర్తించారు. అప్పటికే మంటల్లో కాలిపోతున్న దిచక్ర వాహనాలు ఆర్పేందుకు ప్రయత్నించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న ఇంటి యజమాని దామోదర్ నాయుడు జరిగిన సంఘటనపై కూకట్‌పల్లి ఫిర్యాదు చేశాడు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఆవిష్కరణ

ఆల్విన్‌కాలనీ: మియాపూర్ ఆల్విన్‌కాలనీ క్రాస్ రోడ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా శనివారం విగ్రహా విష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆవిష్కరణ కార్యక్రమానికి మూల అనిల్ గౌడ్, ఏకాంత్ గౌడ్ ఆహ్వానం మేరకు మాజీ ఎంపి విశ్వేశ్వర్‌రెడ్డి, గజ్జెల యోగానంద్, ఎం. రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీ వాసులతో కలిసి స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామన్నారు. సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని, త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబందిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని,అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, మీ కాలనీ, బస్తీల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీ వాసులు వెంకట్‌రెడ్డి, మోహన్‌రావు, జిఎస్ రాజు, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ బాబు, శంకర్‌రావు, పుల్లారావు, రాధాకృష్ణ, ప్రేమ్‌నాయక్, సాంబశివరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ఫార్మా రంగంపై సెమినార్

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీలోని ఫార్మసీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శనివారం ఫార్మారెక్స్ అన్న అంశంపై శనివారం ఒక రోజు సెమినార్ నిర్వహించారు. యూనివర్సిటి వైస్ ఛాన్సలర్ డా. కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ డా. గోవర్ధన్, హరీష్ రామచంద్రన్ డైరెక్టర్ వికాస్ అరోరా, డా. సునీతా రెడ్డి, ప్రొఫెసర్ అజిత తదితరులు పాల్గొన్నారు. వికాస్ అరోరా ఫార్మసీ విస్తరణ దాని వల్ల కలుగుతున్న ప్రయోజనాలు వివరించారు.

మహిళ మృతిపై కుటుంబసభ్యుల ఆందోళన

కూకట్‌పల్లి: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, మహిళ బంధువులు తెలిపిన మేరకు.. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం తిమ్మానగర్‌కు చెందిన జ్ఞానేశ్వర్ గౌడ్ సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య మమత, తన ఇద్దరు కుమారులతో అక్కడే ఉంటున్నారు. మమత (33) సైనస్ సమస్య ఉండటంతో కేపీహెచ్‌బీ నాలుగో రోడ్డులోని మైక్రో ఈఎన్‌టి ఆసుపత్రికి గురువారం వచ్చి సంప్రదించారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు శస్త్ర చికిత్స చేశారు. మధ్యాహ్నం ఆమె చనిపోయిందని బంధువులకు చెప్పడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. సిఐ వెంకటేష్, డిఐ రాజేందర్ గౌడ్, నలుగురు ఎస్ఐలు సిబ్బంది ఆందోళనకారులను నియంత్రించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు సిఐ వెంకటేష్ తెలిపారు. ఆసుపత్రి అడ్మిన్ మేనేజర్ మాట్లాడుతు శస్త్ర చికిత్స తరువాత మమతకు గుండె పోటు వచ్చి మృతి చెందిందని, వైద్యుల నిర్లక్ష్యం లేదని తెలిపారు.